

కూలిన కాపురాలు

బతుకులు, భవిత మీద అవగాహన లేనితనం హత్యలకు, ఆత్మహత్యలకు దారితీస్తోంది. చిన్న చిన్న గొడవలు చినికి చినికి గాలివానగా మారి.. కాపురాలను కూల్చేస్తున్నాయి. గుంతకల్లు మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఓ హత్య, ఓ ఆత్మహత్య.. బంధువుల మధ్య బంధాలు ఏ స్థాయిలో పతనమై పోతున్నాయో చెబుతున్నాయి.

పాతికేళ్లు కూడా నిండని యువకుడికి పెళ్లి జరిగి ఏడాదిన్నర అయింది. ముద్దు లొలికే కొడుకు పుట్టాడు. అప్పటిదాకా వారిద్దరి మధ్య ఏవైనా గొడవలు ఉన్నా.. వారసుడు పుట్టిన ఆనందంలో సర్దుకు పోవాల్సింది. కానీ, ఎక్కువయ్యాయి. అనా రోగ్యంతో బిడ్డ ప్రాణం పోయింది. ఆమె పు ట్టింటికి వెళ్లిపోయింది. జీవితంపై విరక్తి చెంది.. ఆ యువకుడు ఉరి వేసుకున్నాడు.

పల్లెటూరి తండ్రి..! బిడ్డను మురిపెంగా పెంచుకున్నాడు. ఉన్నంతలో ఘనంగా వివాహం జరిపించి.. అత్తారింటికి పంపించాడు. మద్యానికి బానిసైన అల్లుడు.. అదనపు కట్నం కోసం వేధించాడు. ఆమె విసిగిపోయింది. ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. పండంటి కూతురుకు జన్మనిచ్చింది. కానీ భర్త తీరు మారకపోవడంతో ఇక్కడే ఉండిపోయింది. 'నువ్వు రాకపోతే రాకపోతివి.. నా బిడ్డను నాకు ఇచ్చెయ్' అన్నాడు అతను. ఇదేం పద్ధతి అని మామ మందలించాడు. అవమానంగా భావించిన అల్లుడు.. దారికాచి మామను నరికేశాడు..!

వివాహాలు ఇద్దరు మనుషులను, రెండు మనసులను ఏకం చేయడమే కాదు.. రెండు కుటుంబాల మధ్య వారధి నిర్మించాలి. రెండు ఊళ్ల మధ్య బంధాన్ని, బంధుత్వా న్ని పెంచాలి. 'మా ఊరి అల్లుడు, మా ఊరి ఆడబిడ్డ..' అని.. సంతోషంగా చెప్పుకునేలా ఉండాలి. ఇలా అంతటా విషాదం నింపేలా మాత్రం కాదు..!

- గుంతకల్లు టౌన్

ఒక హత్య.. ఒక ఆత్మహత్య ఒకే రోజు.. ఒకే ప్రాంతంలో..

- భార్య, అత్తింటివారి వేధింపులతో యువకుడి బలవన్మరణం
- భార్యను కాపురానికి పంపలేదని మామను నరికేసిన అల్లుడు
- కాపురాలను నిలబెట్టలేకపోయిన పెద్ద మనుషుల పంచాయితీలు

జీవితంపై విరక్తి..



రోహిత్ కుమార్ (ఫైల్)

గుంతకల్లు బీరప్ప సర్కిల్‌లో ఉంటున్న వడ్డె రోహిత్ కుమార్(24) గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. భార్య, అత్తింటివారి వేధింపులే దీనికి కారణమని రోహిత్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. రోహిత్ కుమార్ గుంతకల్లులోని ఓ బైక్ షోరూంలో మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇతనికి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన లక్ష్మీదేవితో గత ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వీరికి కుమారుడు పుట్టాడు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పుట్టింటికి వెళ్లిపోయిన లక్ష్మీదేవి.. తన భర్త రోహి త్‌కుమార్, అతని కుటుంబ సభ్యులపై ఎమ్మిగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 498-ఏ సెక్షన్ కిం ద కేసు నమోదైంది. ఆ తరువాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించింది. కాపురానికి వచ్చేందుకు తన పేరిట 10 సెంట్లు, తన కుమారుడి పేరిట 10 సెంట్ల స్థలం రాయించుకుంది. నెలల వయసున్న వీరి కుమారుడు అనారోగ్యంతో మృతిచెందడంతో లక్ష్మీదేవి తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో పది రోజుల క్రితం రోహిత్ కుమార్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు కుటుంబాలవారిని సీఐ గణేష్ కుమార్ పిలిపించి మాట్లాడారు. తాను కోర్టులో చూసుకుంటానని చెప్పి లక్ష్మీదేవి వెళ్లిపోయింది. ఆ తరువాత తన భర్త రోహిత్‌కుమార్, అతని కుటుంబ సభ్యులతోపాటు సీఐ గణేష్ కుమార్‌కు లాయర్ ద్వారా నోటీసులు పంపించింది. రోహిత్ కుమార్‌కు ఫోన్ చేసి వేధించేది. దీంతో మనోవేదనకు లోనైన రోహిత్ కుమార్.. గురువారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కోడలు లక్ష్మీదేవి, ఆమె కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోహిత్ కుటుంబం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం బైఠాయించింది. పోలీసులు వారికి నచ్చజెప్పారు. మృతుడి తండ్రి వడ్డె కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.




గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న రోహిత్ కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు

దారికాచి.. హత్య



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుంతకల్లు మండలం నల్లదాసరిపల్లికి చెందిన ఆవుల లక్ష్మన్న(52), క్రిష్ణవేణి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. రెండో కూతురు లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి 2021లో వివాహం చేశారు. తాగుడుకు బానిస అయిన చంద్రశేఖర్, పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. ఈ కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. లలిత గర్భం దాల్చడంతో ఆరు నెలల కింద పుట్టింటికి పిలుచుకువచ్చారు. మూడు నెలల క్రితం లలితకు కూతురు పుట్టింది. ఇప్పటికీ నల్లదాసరిపల్లిలోనే ఉంటోంది. అల్లుడి ప్రవర్తన నచ్చక.. ఆమెను పుట్టింటివారు కాపురానికి



లక్ష్మన్న (ఫైల్)

పంపలేదు. దీంతో చంద్రశేఖర్ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. కాపురానికి రానిపక్షంలో మూడు నెలల పాపను తానే పెంచుకుంటానని అన్నాడు. 'పాలుతాగే పసిబిడ్డను ఎలా తీసుకెళతావు..? బుద్ధి లేదా..?' అని అల్లుడిని లక్ష్మన్న మందలించాడు. ఇలా పంచాయితీలో అవమానం జరిగిందని మామ మీద చంద్రశేఖర్ కక్ష పెంచుకున్నాడు. చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో లక్ష్మన్న గురువారం పనిమీద గుంతకల్లుకు వెళ్లాడు. సాయంత్రం 6-30 గంటలకు బైకు మీద స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. ఆ దారిలో.. తిమ్మాపురం సమీపంలోని నక్కా ఓబులేసు పొలం వద్ద చంద్రశేఖర్, అతడి అన్న రాజశేఖర్, అన్న స్నేహితుడు సతీష్ మాటు వేశారు. లక్ష్మన్న రాగానే కత్తులతో విచక్షణా రహితంగా నరికేసి, పారిపోయారు.

ఏమీ ఎరగనట్లు..

చీకటి పడినా లక్ష్మన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో అనుమానంతో గుంతకల్లు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సెల్‌ఫోన్ లొకేషన్ తిమ్మాపురం వద్ద చూపించడంతో రూరల్ ఎస్ఐ కె.సురేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే లక్ష్మన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. హత్య చేసిన చంద్రశేఖర్ ఏమీ ఎరగనట్లు అక్కడికి వచ్చాడు. లక్ష్మన్న వైసీపీ వర్గీయుడు కావడంతో టీడీపీవారే హత్య చేసి ఉంటారని పోలీసులను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించాడు. పోలీసులు అనంతపురం నుంచి క్లూస్ టీంను, జాగిలాలను రప్పించారు. జాగిలాలు అక్కడే ఉన్న చంద్రశేఖర్ వద్దకు వెళ్లి ఆగిపోవడంతో వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మరో ఇద్దరితో కలిసి తన మామను హత్య చేశానని ఒప్పుకున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీలు బీకే, అంబికా, మంత్రి కేశవ్

విమానాశ్రయం ఏర్పాటు చేయించండి

కేంద్ర మంత్రికి ఎంపీ అంబికా వినతి

అనంతపురం అర్బన్, జూలై 5: జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథితో కలిసి శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం విమానాశ్రయం ఏర్పాటు చేయాలని, ఉద్యాన పంటల ఎగుమతికి అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని కోరారు. ఏవియేషన్ ట్రైనింగ్ కోసం కృషి చేయాలని విన్నవించారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

యువరైతు ఆత్మహత్య



చిలమకూరి సుధీర్ కుమార్ (ఫైల్)

పామిడి, జూలై 5: మండల పరిధిలోని పొగరూరు గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి రైలు కిందపడి రైతు చిలమకూరి సుధీర్ కుమార్(31) ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. పెద్దవడుగూరు మండలం పెనకలపాడు కొట్టాలపల్లి గ్రామానికి చెందిన సుధీర్ కుమార్.. పదో తరగతి వరకూ చదివాడు. మూడేళ్ల పాటు కువైట్‌లో ఉండి డబ్బు సంపాదించాడు. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం, పాడి పశువుల పెంపకంతో ఉపాధి పొందేవాడు. గత ఏడాది ప్రమాదవశాత్తు ఎద్దులు మృతి చెందాయి. మూడు ఎకరాలలో డ్రాగన్ ఫ్రూట్, ఇతర పంటలు సాగు చేసి నష్టపోయాడు. సంపాదించిన సొమ్ము పోవడంతోపాటు రూ.7 లక్షల వరకూ అప్పులు అయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడ్డాడు. సంఘటనా స్థలాన్ని జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు సందర్శించి వివరాలు సేకరించారు. సుధీర్ కుమార్‌కు వివాహం కాలేదు. తల్లిదండ్రులు, ఒక తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. జీఆర్‌పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇక్కడే ఉంటాం.. ప్లీజ్..!

పైరవీలు ప్రారంభించిన అక్రమార్కులు
వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి.. తంటాలు



కళ్యాణదుర్గం, జూలై 5: వైసీపీ ప్రభుత్వంలో అవినీతి మరకలు అంటించుకున్న కొందరు అధికారులు.. ప్రభుత్వం మారినా చక్రం తిప్పేందుకు సిద్ధమౌతున్నారు. 'మీరు చెప్పినట్లే వింటాం.. మాకు అవకాశం ఇవ్వండి' అని కొత్త ప్రజాప్రతినిధులను లైన్‌లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పని చేసిన కొందరు అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అప్పటి అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల అండతో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం మారడంతో తమ కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు. కానీ అవినీతి మరకలున్న అధికారులు మళ్లీ కోరుకున్న చోట పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులను బదిలీ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో త్వరలో బదిలీల ప్రక్రియ మొదలవుతుందని భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీతో అంటకాగిన అధికారులు ఎత్తులు వేస్తున్నారు.

రుచి మరిగారు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసిన అధికారులు మళ్లీ ఇక్కడే పోస్టింగ్ వేయించుకోవాలని చూస్తున్నారు. ఇక్కడే ఉన్న వారు కూడా స్థాన చలనం లేకుండా చూసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. అర్థ, అంగ బలాలను సిద్ధం చేసుకుంటున్నారు. పలువురు ఆర్ఐ, వీఆర్వోలు ఇదే నియోజకవర్గంలో పనిచేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. టీడీపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేసిన ఆర్ఐలు, వీఆర్వోలకు బదిలీల భయం పట్టుకుంది. అన్ని శాఖల కన్నా రెవెన్యూ శాఖే కీలకంగా కావడంతో పైరవీలు జోరందుకున్నాయి. పలువురు డిప్యూటీ తహసీల్దార్లు భారీస్థాయిలో మంతనాలు సాగిస్తున్నారు. రెవెన్యూ డివిజన్‌లో అక్రమార్జనకు చాలా మార్గాలు ఉండటంతో పలువురు అక్రమ సంపాదనకు రుచిమరిగారు. అందుకే, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుంటే మరో ఐదేళ్లు పబ్బం గడుపుకోవచ్చని భావిస్తున్నారు. ఏదో ఒక విధంగా ఇక్కడ తిష్టవేసేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

అన్ని శాఖలవారూ..

వ్యవసాయ శాఖకు చెందిన కొందరు అధికారులు తమను నియోజకవర్గం నుంచి బయటకు పంపవద్దని, కావాలంటే పక్క మండలానికి బదిలీ చేయాలని టీడీపీ నేతలను ప్రాధేయపడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ఉద్యోగులూ ఇదే తరహాలో పైరవీలు చేసుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయాలలో కొలువుల కోసం గతంలో పనిచేసిన వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అప్పట్లో బదిలీ అయినవారు వెనక్కు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వెలుగు కార్యాలయంలో పనిచేసే యానిమేటర్లు, సీసీలైతే నేతల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రాధేయపడుతున్నారు. 'గతంలో వైసీపీ ప్రభుత్వానికి పనిచేశాము. ఇప్పుడు మీరు ఎట్ల చెబితే అట్ల పని చేస్తాం..' అని ప్రాధేయపడుతున్నారు. కళ్యాణదుర్గం, కంబదూరులో పని చేసే సీడీపీవోల పనితీరుపై అప్పట్లో భారీగా విమర్శలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాశారన్న ఆరోపణలను ఎదుర్కొన్నారు. వారు కూడా ఇక్కడే పనిచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పోలీసు శాఖలో పని చేసే ఎస్ఐలు, కానిస్టేబుళ్లు కొందరు ఇప్పటికే టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఇక్కడే ఏదోలా పోస్టింగ్ ఇప్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

వచ్చేస్తోంది.. వరద..

టీబీ డ్యాంలోకి ఒకేరోజు 3 టీఎంసీలు

బళ్లారి గాంధీనగర్/రాయదుర్గం, జూలై 5: తుంగభద్ర జలాశయానికి ఎగువన మలెనాడు ప్రాంతంలో భారీ వర్షాలకు నదులు పొంగి ప్రవహిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో శివమొగ్గ జిల్లా గాజిగనూరు సమీపంలోని తుంగ జలాశయం నిండిది. జలాశయం భద్రత దృష్ట్యా 15 క్రస్టుగేట్ల ద్వారా 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భద్ర జలాశయానికి 4,098 క్యూసెక్కుల వరద చేరుతోంది. అదే ప్రాంతంలో లింగనమక్కి జలాశయానికి 60,238 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఈ వరద నీరు తుంగభద్ర జలాశయం దిశగా పరుగులు పెడుతోంది. తుంగ జలాశయం నుంచి తుంగభద్ర జలాశయానికి 100 కి.మీ. దూరం ఉంది. దీంతో ఈ వరద నీరు తుంగభద్ర జలాశయానికి చేరేందుకు 15 గంటల సమయం పడుతుంది. తుంగభద్ర జలాశయానికి శుక్రవారం సాయంత్రం 18,500 క్యూసెక్కుల వరద చేరుతోంది. శనివారానికి 50 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉంది. జలాశయం నీటి నిల్వలు 12 టీఎంసీలకు చేరాయి. ఒకే రోజు మూడు టీఎంసీల నీరు చేరింది. గత ఏడాది ఇదే సమయానికి ఇన్‌ఫ్లో కేవలం 259 క్యూసెక్కులు కాగా, జలాశయంలో నీటి నిల్వలు 3.07 టీఎంసీలు ఉండేవని బోర్డు అధికారులు తెలిపారు.



తుంగ జలాశయం నుంచి దిగువకు వరద

జరిమానాలు స్వాహా

అటవీశాఖలో ఇద్దరి రాజ్యం
చలానా సొమ్ము భారీగా పక్కదారి
ఉన్నతాధికారులు విచారించేరా..?





సీసీఎఫ్ బంగ్లాలో నరికిన శ్రీగంధం చెట్టు

అనంతపురం న్యూటౌన్, జూలై 5: జిల్లా అటవీశాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. ఆ శాఖకు జమ చేయాల్సిన సొమ్మును దర్జాగా స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా చలానాల రూపంలో వచ్చిన సొమ్మును సైతం శాఖ ఖాతాలో జమ చేయకుండా కార్యాలయంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి సహకారంతో ఇద్దరు అధికారులు దిగిమింగేశారు. ఆడిట్ బృందం ఇక్కడే మకాం వేసి రికార్డులను పరిశీలించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. రెగ్యులర్ ఉద్యోగులు తమ తప్పు ఏమీ లేదని, తప్పంతా కాంట్రాక్ట్ వర్కర్‌దే అన్నట్లు అతడిపై కేసు పెట్టి జైలుకు పంపించారు. అసలైన ఆ ఇద్దరు అధికారుల గురించి పట్టించుకొనే నాథుడే కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఆ ఇద్దరు అధికారులు కాంట్రాక్ట్ వర్కర్‌ను అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై డీఎఫ్‌ఓలు, సీసీఎఫ్ పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఏకంగా రూ.15 లక్షలు సొమ్ము దిగమింగినట్లు తెలుస్తోంది. కార్యాలయంలోని ఆ ఇద్దరు అధికారులపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చి శాఖకు రావాల్సిన సొమ్ము జమ అయ్యే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అడిషినల్ పీసీసీఎఫ్ రెండు రోజుల పాటు ఇక్కడే మకాం వేయడంతో ఆ దిశగా విచారణ చేస్తారనే ప్రచారం జరుగుతోంది

• సీసీఎఫ్ బంగ్లాలోనే..

అడవులను కాపాడాల్సిన అధికారులు జిల్లా కేంద్రంలోని ఆ శాఖ ఉన్నతాధికారి ఉండే బంగ్లాలో ఉన్న శ్రీగంధం చెట్లను కాపాడలేని పరిస్థితి. రేంజర్, డిప్యూటీ రేంజర్ వైఫల్యాలు స్పష్టంగా కనిపించినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకుపోతే.. కూడా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. బంగ్లాలో ఉన్న చెట్లను కాపాడలేకపోయిన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

• దారి మళ్లుతున్న సొమ్ము

జిల్లా పరిధిలో ప్రజల నుంచి ఏదైనా తప్పిదం జరిగితే వారికి చుక్కలు చూపించేలా అపరాధ రుసుం వసూలు చేస్తారు. ఆ సొమ్ము శాఖ ఖాతాలో జమచేయకుండా ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో ఉన్నతాధికారులు ప్రశ్నించినా, కోర్టు ఖర్చుల కోసం వెచ్చించాల్సి వచ్చిందని సాకులు చెప్పి చివాట్లు తిన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ నాయకుడికి సంబంధించిన వంట చెరుకు లోడ్‌ను పట్టుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అందుకు అనుగుణంగా అపరాధ రుసుం విధించి, ఉన్నతాధికారుల ఆమోదానికి పంపారు. 'అపరాధ రుసుం చెల్లిస్తే సరిపోతుందా..? మా ఖర్చులు ఎవరు చూస్తారు?' అని కార్యాలయంలో మరో రూ.6 వేలు అదనంగా వసూలు చేసినట్లు తెలిసింది

ఆడ... ఈడ.. మీరే పని చేయండి.!

గంగవరం పాఠశాలకు ఇదే పరిష్కారమట..

అనంతపురం విద్య: 'మేము ఉత్తర్వులు ఇవ్వం. మీరు అక్కడ.. ఇక్కడ.. రెండు చోట్లా పనిచేయండి..' ఇదీ గంగవరం పాఠశాల సమస్యకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు చూపుతున్న గొప్ప పరిష్కారం. గంగవరం హైస్కూల్‌కు వెళ్లాల్సిన 3, 4, 5 తరగతుల విద్యార్థులు తిరిగి ప్రాథమిక పాఠశాల(మెయిన్)కు వెళుతున్న విషయం తెలిసిందే. విద్యార్థులు ఇక్కడ, గురువులు అక్క డ అన్నట్లుగా తయారైన పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో 'ఆ బడికి వెళ్లేదే లే' శీర్షిక గురువారం కథనం ప్రచురితైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు.. నోటి మాటతో సరిపెట్టారు. 'మీరు అక్కడికి వెళ్లి పాఠాలు చెప్పండి..' అని హైస్కూల్‌లో పనిచేస్తున్న ఆరుగురు సబ్జెక్టు టీచర్లను ఆదేశించినట్లు తెలిసింది. మిగులు ఉపాధ్యాయులు చాలామందే ఉన్నారని జగన్ ప్రభుత్వంలో విద్యాశాఖ అధికారులు గొప్పలు పోయారు. అదే నిజమైతే.. వారిలో కొందరిని గంగవరం ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేయొచ్చు. లేదంటే పరిస్థితిని కలెక్టర్, లేదా విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోరవచ్చు. అలా కాకుండా మౌఖిక ఆదేశాలు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

పత్తి తూకాల్లో మోసం

దళారులకు దేహశుద్ధి చేసిన రైతులు



దళారులను నిలదీస్తున్న రైతులు

బొమ్మనహాళ్, జూలై 5: రిమోట్ సెన్సర్లతో తూకాల్లో మోసాలకు పాల్పడిన దళారులకు పత్తి రైతులు దేహశుద్ధి చేశారు. పత్తి దిగుబడులను కొనేందుకు కర్నూలు జిల్లా ఆదోని నుంచి కొందరు దళారులు బొమ్మనహాళ్ మండలం గొనూరు గ్రామానికి శుక్రవారం వచ్చారు. రైతులు కొల్లేరప్ప నుంచి 36 క్వింటాళ్లు, నాగరాజు నుంచి 15 క్వింటాళ్లు, తిప్పయ్య నుంచి 23 క్వింటాళ్లు సేకరించారు. మొత్తం 72 క్వింటాళ్ల పత్తిని క్వింటం రూ.8,250 చొప్పున రైతులు విక్రయించారు. కానీ ఈ పత్తి తూకాల్లో దళారులు మోసాలకు దిగారు. కొల్లేరప్ప 36 క్వింటాళ్ల పత్తిని స్కేల్ రిమోట్ ద్వారా 31 క్వింటాళ్ల తూకం చూపించారు. దీంతో రైతులకు అనుమానం వచ్చి.. ఎల్‌బీ నగర్‌కు తీసుకువెళ్లి వేబ్రిడ్జి కాటాలో తూకం వేయించారు. అక్కడ 72 క్వింటాళ్లకు అదనంగా మరో 12 క్వింటాళ్ల తూకం వచ్చింది. తూకాల్లో తేడాపై ఆరాతీస్తే.. దళారుల మోసం బయట పడింది. దీంతో ఆగ్రహించిన రైతులు.. దళారులకు దేహశుద్ధి చేశారు. కొందరు జోక్యం చేసుకుని, 12 క్వింటాళ్ల పత్తికి దళారుల నుంచి డబ్బులు ఇప్పించారు. రైతులను దళారులు పదే పదే మోసగిస్తున్నా.. తూనికలు, కొలతల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇప్పుడైనా..!

- జీబీసీ నీటి కోసం రైతుల నిరీక్షణ
- రూ.243 కోట్లతో ఆధునికీకరణ ప్రారంభం
- పనులను అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లు బీడుగా ఆయకట్టు భూములు
- కూటమి అధికారంలోకి రావడంతో చిగురిస్తున్న ఆశలు



మొదటి ప్యాకేజీలో పూర్తయిన ఆధునికీకరణ పనులు

విడపనకల్లు, జూలై 5: ఉరవకొండ నియోజకవర్గంలో రైతులకు ముఖ్యంగా మిరప సాగు చేసినవారికి జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కాలువ) ప్రాణధారం. విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో సాగు చేసిన పంట పొలాలకు ఈ కాలువ ద్వారానే నీరందుతుంది. అందుకే నియోజకవర్గ రైతుల పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇప్పించడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పయ్యావుల కేశవ్(ప్రస్తుత మంత్రి) యత్నించారు. ఇందుకోసం రూ.243 కోట్ల నిధులు మంజూరు చేయించి, జీబీసీ ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ పనులను రెండు ఫేజ్‌లలో చేపట్టారు. మొదటి ఫేజ్‌లో 1వ కిలోమీటర్ నుంచి 28వ కిలోమీటర్ వరకూ 100శాతం పనులు పూర్తి చేశారు. 2వ ఫేజ్‌లో 28వ కిలోమీటర్ నుంచి 60వ కిలో మీటర్ వరకూ రూ. 123 కోట్లతో పనులు చేపట్టారు. అయితే పనులు పూర్తి కాకనే టీడీపీ అధికారం కోల్పోయింది. దీంతో 30శాతం పనులు నిలిచిపోయాయి. ఈ (9వ కాలువ) పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టకపోవటంతో ఐదేళ్ల నుంచి ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారాయి. అంచనహాళ్ గ్రామం వద్ద ప్రధాన కాలువ పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంత రైతులతో పాటు ఖాజీపురం, కొట్టాల, గుంతకల్లు రైతులు వర్షాధారంగా పంటలు వేసుకొని లక్షల్లో నష్టపోయారు. సాగు నీరు బంద్ అయిన సమయంలో కూడా హంద్రీనీవా నీటిని జీబీసీకి తీసుకురావటంలో వైసీపీ నాయకులు విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి.

ఎక్కడపడితే అక్కడ రంధ్రాలు



16వ కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్‌కు రంధ్రం

19వ కిలోమీటర్ వద్ద కాలువకు రంధ్రం

జీబీసీకి నీళ్లు వచ్చిన సందర్భంలో నాన్ ఆయకట్టు రైతులు ఎక్కడ పడితే అక్కడ అక్విడెక్ట్‌లకు, అండర్ టన్నెళ్లకు రంధ్రాలు వేస్తున్నారు. దీంతో సాగు నీరు వంకలకు వెళ్తోంది. దీనివల్ల అసలైన ఆయకట్టు రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని వైసీపీ నేతలు అరికట్టకపోగా నాన్ ఆయకట్టు రైతులకు అండగా నిలిచారు. కాలువపై మోటార్లు వేసుకుని సాగు నీరు వాడుకుంటున్న రైతులను సైతం ఎవరూ అడ్డుకోలేకపోయారు. ప్రతి ఏటా గుత్తలు కట్టే ఆయకట్టు రైతుల పొలాలు మాత్రం నీటితో తడవ లేదు. అందుకే జీబీసీ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేస్తు సాగు నీటి సమస్యలు తీరుతాయని రైతులు పేర్కొంటున్నారు. 1వ కిలోమీటర్ నుంచి 60వ కిలోమీటర్ వద్ద వరకూ ఉన్న 25 బ్రిడ్జిలు, 4 అండర్ టన్నెళ్లు 70 ఏళ్ల కిందట నిర్మించిన వని, ఇవి పూర్తిగా శిథిలమై పోవటంతో సాగు నీరు వంకలకు వృథాగా పోతోందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.



6వ కాలువకు సాగు నీరు అందకపోవడంతో ప్రధాన కాలువను ధ్వంసం చేసిన ఆయకట్టు రైతులు



5వ కాలువ వద్ద షట్టర్లు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రతిసారీ నష్టాలే



జీబీసీ ఆధునికీకరణ పనులు చేపట్టిన తరువాత ప్రభుత్వం మారిపోయింది. మిగిలిన పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో సాగు నీరు అందక మిరప పంటలు సాగ చేసిన ప్రతి సారీ నష్టాలే వచ్చాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో పనులు పూర్తి చేసి, సాగు నీరు అందిస్తారని ఆశిస్తున్నాం.

- మనోహర, రైతు, ఆర్ కొట్టాల

ఐదేళ్లుగా పట్టించుకోలేదు



టీడీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ పనుల్లో భాగంగా 9వ కాలువను వెడల్పు చేసి వదిలేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కనీసం సైడ్ వాల్స్ లైనింగ్ కాని బేస్‌మెట్ సిమెంట్ కానీ చేయలేదు. దీంతో కాలువకు సాగునీరు రాక గడేకల్లు, కడదరబెంచి, డొనేకల్లు, గ్రామాలో వేల ఎకరాల పొలాలు బీళ్లుగా మారాయి. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందనిపిస్తోంది.

- పరశురాముడు, రైతు, గడేకల్లు

మరమ్మతులు చేయించి, సాగు నీరు అందిస్తాం

జీబీసీలో 1వ కిలోమీటర్ నుంచి 60వ కిలోమీటర్ వరకూ ఉన్న 28 బ్రిడ్జిలను రిపేర్లు చేయించేందుకు దాదాపు రూ.4కోట్లతో ప్రతి పాదనలు పంపాం. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం బ్రిడ్జిల వద్ద రంధ్రాలు, కూల్చిన గోడలను మరమ్మతులు చేయిస్తున్నాం. ఆగస్టు నెలలో సాగు నీరు వచ్చే లోగా డ్యామేజ్‌లు ఉన్న చోట పనులు పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తాం.

- రాజశేఖర్, జీబీసీ ఏఈ, విడపనకల్లు

బాలిక కిడ్నాప్.. నిందితుడిపై పోక్సో కేసు



నిందితుడు కొల్లప్ప

కుందుర్పి, జూలై 5: ప్రార్థనల పేరుతో విద్యార్థినిపై కన్నేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన 47 సంవత్సరాల వయసుగల కొల్లప్ప కుందుర్పిలో ఓ ప్రార్థనా మందిరంలో పని చేస్తున్నాడు. ప్రార్థనలు చేస్తే సమస్యలు తీరుతాయని చుట్టుపక్కల ప్రజలను నమ్మించి వారికి చేరువయ్యాడు. ప్రతి ఆది, సోమవారాల్లో ప్రార్థనలు నిర్వహించేవాడు. బాధిత విద్యార్థి ఇంట్లో కూడా ప్రార్థనలు చేస్తూ కూలి పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులకు చేరువయ్యాడు. వారికి తనపై పూర్తి స్థాయిలో నమ్మకాన్ని కలుగజేసుకున్నాడు. ఈ క్రమంలోనే గతనెల 29న అనంతపురంలో ప్రార్థనల కోసమని బాలికను తీసుకెళ్లాడు. అయితే అనంతపురంలో ప్రార్థనలకు కాకుండా విజయవాడకు కారులో విద్యార్థినిని ఎత్తుకెళ్లాడు. మరుసటి రోజు ఏలూరులో ఒక ఇంట్లో ఉంచాడు. తల్లిదండ్రులు కొల్లప్పను ఫోన్‌లో సంప్రదించగా, పని చేయలేదు. దీంతో అనుమానం వచ్చి కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. కాగా విద్యార్థినితో కొల్లప్ప అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె ససేమిరా అనడంతో భయపడి తిరిగి కుందుర్పికి తీసుకువచ్చి వదిలేశాడు. ఇంటికి వచ్చిన బాధితురాలు, జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. పోలీసులు గురువారం సాయంత్రం మహంతపురం గ్రామ సమీపాన కొల్లప్పను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతనిపై పోక్సో కిడ్నాప్ కేసులను నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు



అనంతపురం రూరల్, జూలై 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 709 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి ప్రాజెక్టులను పరిశీలించిన కేంద్ర బృందం



పీఏబీఆర్‌ను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ అధికారుల బృందం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: జిల్లాలోని పీఏబీఆర్, హెచ్‌ఎల్‌ఎంసీలను కేంద్రజలశక్తి అభియాన్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. జలశక్తి అభియాన్ కేంద్ర అధికారులు అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్ ఖాన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, హెచ్చెల్సీ ఈఈ శ్రీనివాసుల బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించింది. తొలుత హెచ్చెల్సీ పరిధిలోని పీఏబీఆర్ డ్యాంకు వెళ్లిన అధికారుల బృందం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం, నాణ్యత, లీకేజీ, మొక్కలు పెరిగిన పరిస్థితులను పరిశీలించారు. పూర్తిస్థాయి నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ, డ్యాం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎల్‌ఎంసీ ప్రధాన కాలవను పరిశీలించారు. అక్కడ పీఏబీఆర్ లింక్‌చానల్ సామర్థ్యం, నాణ్యతను పరిశీలించారు. ఈమేరకు అధ్యయనం చేసిన అంశాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. తరచూ డ్యాం పర్యవేక్షణ చేయాలని, మరమ్మతులకు సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డ్యాం, హెచ్చెల్సీ నిర్వహణ పై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వహణ లేకపోతే తీరని నష్టం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు.

డీఈఓ గారు..! ఫోన్ ఎత్తండి..

- సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించని అధికారి
- ప్రవేశాల వేళ నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం
- ఉన్నతాధికారి తీరు పట్ల విద్యార్థి సంఘాల మండిపాటు



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

అనంతపురం విద్య, జూలై 5: సమస్యలు ఏవైనా ఉంటే ఈ 9849909112కి ఫోన్ చేయమంటారు. కానీ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయరు. మరి మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి అని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు, వేలాది టీచర్లు, ఉద్యోగులు పనిచేసే విద్యాశాఖ ఉన్నతాధికారి ఫోన్ నెంబర్ అది. జిల్లా ఉన్నతాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజల నుంచి వచ్చే గ్రీవెన్సులను, ఇతర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వారిది. ప్రస్తుతం స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాల సమయం, పైగా అనేక సమస్యలు క్షేత్రస్థాయిలో ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు వీలు లేని ప్రజలు, జిల్లాకేంద్రానికి వచ్చేందుకు ఆర్థిక స్తోమత లేని విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ ద్వారా సంప్రదిస్తారు. అయితే జిల్లా విద్యాశాఖాధికారి అటు విద్యార్థుల తల్లిదండ్రులకు కానీ, ఇటు ప్రజలు, విద్యార్థి సంఘాల నేతలకు కానీ ఫోన్‌లో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రవేశాల వేళ....జిల్లా విద్యాశాఖాధికారి స్పందించకపోవడంపై ఆయా వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రైవేట్ స్కూళ్లపైనే శ్రద్ధ



జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అనేక స్కూళ్లకు అనుమతులు లేవు. విచ్చల విడిగా యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి. అనేకసార్లు ధర్నాలు చేశాం, ఇతర రూపాల్లో నిరసనలు తెలిపాం. పలుమార్లు గ్రీవెన్సులో వినతులు ఇచ్చాం. ఇప్పటి వరకూ ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డీఈఓకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న శ్రద్ధ, పబ్లిక్ గ్రీవెన్సులపై ఉండటం లేదు. ఫోన్ చేస్తే స్పందనే ఉండదు. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కొనసాగిన సీబీఐ విచారణ

డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం ఇళ్లలో సోదాలు

గుంతకల్లు, జూలై 5: స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో అవినీతిపై సీబీఐ అధికారులు చేపట్టిన విచారణ శుక్రవారం రాత్రి దాకా కొనసాగింది. గురువారం సాయంత్రం డీఆర్ఎం కార్యాలయంపై సీబీఐ దాడి జరిగిన సంగతి పాఠకులకు విదితమే. కడప వద్ద నిర్మించనున్న ఓ రైలు వంతెన పనికి సంబంధించి యాక్సెప్టెన్సీ ఉత్తర్వుల జారీ కోసం అకౌంట్స్ విభాగ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బును డిమాండ్ చేయగా, రమేశ్‌రెడ్డి అనే బాధిత కాంట్రాక్టరు నుంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు జరిగాయి. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు, అకౌంట్సు విభాగం ఓఎస్ బాలాజీతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు వారిలో ఒకరిని అప్రూవర్‌గా మార్చి, నిందితుల జాబితా నుంచి తొలగించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువా రం రాత్రి సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరు ప్రదీప్ బాబు ఇంట్లో సీబీఐ అధికారులు సోదాలను నిర్వహించారు. రాత్రి పొద్దుపోయేదాకా డీఆర్ఎం కార్యాలయంలో అదుపులో ఉన్న నిందితులను విచారణ చేశారు. శుక్రవారం ఉదయం డీఆర్ఎం వినీత్ సింగ్ నివాసమున్న క్వార్టర్సుకు వెళ్లి అక్కడ కూడా తనిఖీలు జరిపినట్లు తెలిసింది. పలు రైలు వంతెనలకు జరిగిన ఈ భారీ టెండరు కేటాయింపులో డీఆర్ఎం ప్రమేయం ఉంటుంది. ఈ మేరకు కాంట్రాక్టరు నుంచి వసూలు చేసిన లంచం విషయంగా డీఆర్ఎం ప్రమేయంపై కూడా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఉదయం నుంచి రాత్రి వరకూ డీఆర్ఎం ఇంట్లో సోదాలను నిర్వహించి, మరలా ఆయన కార్యాలయానికి వచ్చి కేసు రిపోర్టులను తయారు చేసినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి విచారణ పూర్తిచేసి నిందితులను సికింద్రాబాద్‌లోని సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించనున్నట్లు తెలిసింది.

విలేకరులకు నో ఎంట్రీ

సీబీఐ దాడి నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు డీఆర్ఎం కార్యాలయంలోకి రాకుండా ఆర్పీఎఫ్ సిబ్బందిని కాపలాగా ఉంచారు. లంచం డిమాండ్, ఉన్నతాధికారుల అరెస్టుకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడినా వార్తలు రావడంతో శుక్రవారం విలేకరులు డీఆర్ఎం కార్యాలయంలోకి వెళ్లకుండా నిరోధించేందుకు యత్నించారు. అవినీతిపై దాడి, అధికారుల అదుపు విషయంగా అటు సీబీఐ అధికారులుగానీ, ఇటు డీఆర్ఎం కార్యాలయంగానీ అధికారిక సమాచారం వెల్లడించ లేదు.

నేడు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, జూలై 5: ఓ ప్రైవేట్ సంస్థల్లో వంద పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి తెలిపారు. 18 నుంచి 27ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగ యువకులు ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యాభ్యాసం చేసిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉమ్మడి జిల్లాలో స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో క్రెడిట్ అసిస్టెంట్స్‌గా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వారి బయోడేటా, అర్హత గల సర్టిఫికెట్స్, వాటి జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా

అనంతపురం అర్బన్, జూలై 5: జిల్లాలోని పశువైద్యశాలల్లో శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకా ఉచితంగా వేయనున్నట్లు పశు సంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్య శాలల్లో టీకా అందుబాటులో ఉంచామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తప్పని సరిగా కుక్కలకు రేబిస్ టీకా వేయించాలని సూచించారు.

నోడల్ అధికారులకు అవగాహన సదస్సు

అనంతపురం విద్య, జూలై 5: జిల్లాలో పోష్ యాక్ట్-2013 కింద నోడల్ ఆఫీసర్లుగా నియమితులైన వారికి శనివారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు ఉంటుందని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పని ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నియంత్రణకు కలెక్టర్ నోడల్ అధికారులకు నియమించారన్నారు. ఆ అధికారులకు శనివారం సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైసీపీ దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

స్థల వివాదం.. ఇరువర్గాల ఘర్షణ

పెనుకొండ రూరల్, జూలై 5: అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులు గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడుతున్నారు. రొద్దం మండలం పెద్దకోడిపల్లిలో స్థల వివాదంపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో టీడీపీ సానుభూతిపరులైన నలుగురు మహిళలు శుక్రవారం తీవ్రంగా గాయపడ్డారు. బాధిత మహిళలు సరస్వతమ్మ, నాగరంగమ్మ, అక్కమ్మ, చిట్టి దాడి విషయాలు వివరించారు. పెద్దకోడిపల్లిలో బాధితుల ఇంటి సమీపంలో వంకనీరు వెళ్లే విషయంగా 2018 సంవత్సరంలో కోర్టును ఆశ్రయించామన్నారు. వివాదస్థలంలో ఎలాంటి అక్రమ కట్టడాలు కట్టరాదని గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన నరసింహప్ప, పోతన్నలకు కోర్టు నోటీసులు ఇచ్చిందన్నారు. వీటిని ధిక్కరించి పోలీసు అండదండలతో వివాదాస్పద భూమిలో రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. శుక్రవారం ఉదయం తాము స్థలం వద్దకు వెళ్లి కోర్టు పరిధిలో ఉన్న భూమిలో అక్రమ నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించగా మూకుమ్మడిగా వైసీపీ సానుభూతిపరులైన పోతన్న, గోవిందయ్య, నరసింహులు, రమేష్ పోతన్న, నరసింహులు, నాగరాజు, వెంకటేశులు, నరేష్, సుశీలమ్మ, సుభాషిణి, అక్కమ్మ, అమృత, శాంతి దాదాపు 15మంది మూకుమ్మడిగా రాడ్లు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. గాయపడిన తమను స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అక్కమ్మ, చిట్టిలను మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయంపై రొద్దం ఎస్ఐ వలీబాషను వివరణ కోరగా పెద్దకోడిపల్లి స్థల వివాదంపై ఘర్షణ పడ్డ సంగతి వాస్తవమేనన్నారు. ఈ ఘర్షణపై ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

గూగూడు ఉత్సవాలను జయప్రదం చేయండి



అగ్ని గుండాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

నార్పల, జూలై 5: మండలంలోని గూగూడులో ఈనెల 7నుంచి 17 వరకు జరిగే కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గూగూడులో శుక్రవారం ఆయన పర్యటించి, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మొదట గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి లోటు పాట్లు వసతులు కల్పించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం కాబట్టి పారిశుధ్యపనులు ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. గ్రామంలో 50మంది యువకులను ఓ బృందంగా ఏర్పాటు చేసుకుని పోలీస్ శాఖ వారు బ్రహ్మోత్సవాల్లో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ ప్రభాకర్‌రావు, స్పెషల్ అధికారి రామసుబ్బారెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం సుభాన్

గుత్తి, జూలై 5: పట్టణంలోని కోట వీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిరుమల జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుభాన్ శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థి పారా అథ్లెట్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో షార్ట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్క్‌త్రో క్రీడల్లో ప్రతిభ చూపించాడు. ఈనెల 16న బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పారా అథ్లెట్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించి, సర్టిఫికెట్‌లను అందజేశారు.

నేడు జిల్లాకు శాస్త్రవేత్తల బృందం రాక

అనంతపురం అర్బన్, జూలై 5: వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తల బృందం శనివారం జిల్లా పర్యటనకు రానుంది. భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం బెంగళూరు నుంచి 10 మందితో కూడిన వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తల బృందం సభ్యులు శనివారం ఉదయం జిల్లాకు చేరుకోనున్నారు. స్థానిక డ్వామా హాల్‌లో శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం గార్లదిన్నె లేదా బత్తలపల్లి, ఇతర మండలాల్లో క్షేత్ర స్థాయిలో చీనీ, నర్సరీలను పరిశీలించనున్నట్లు సమాచారం. ఆదివారం రెండో రోజు శాస్త్రవేత్తల బృందం సభ్యులు ఇతర ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు సమాచారం.

బీసీ వసతి గృహాలను అభివృద్ధి చేయండి

● మంత్రి సవితకు ఎమ్మెల్యే వినతి



మంత్రి సవితకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల జూలై 5: నియోజకవర్గంలోని బీసీ వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు మంత్రి సవితమ్మ సహకరించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. శుక్రవారం పెనుకొండ రోడ్లు భవనాల అతిథిగృహంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. గూగూడు కుల్లాయి స్వామి బ్రహోత్సవాలకు మంత్రిని ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీసీ వసతి గృహాల్లో మెరుగైన సౌకార్యాలు కల్పించాలని మంత్రిని కోరారు.

మంత్రి సవితను కలిసిన దండు



మంత్రి సవితను సన్మానిస్తున్న దండు శ్రీనివాసులు, నాయకులు

శింగనమల జూలై 5: బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను తెలుగుయవత అధికారప్రతినిధి దండు శ్రీనివాసులు కలిశారు. శుక్రవారం పెనుకొండలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసులుతో పాటు గంగాధర్, కుళ్లాయప్ప, బండిపరశురాం, నారాయణస్వామి, ప్రకాశ్, రంగస్వామి ఉన్నారు.

పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు



విద్యార్థులు తయారుచేసిన నమూనాలను తిలకిస్తున్న కమిషనర్

అనంతపురం సెంట్రల్, జూలై 5: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల విద్యార్థుల్లో పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం నగరంలోని బాలుర ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నైపుణ్యాల ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి అధ్యక్షతన టాటాస్టైవ్, సీమెన్స్, డ్యూయెల్ వెట్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోటీలకు మేఘ స్వరూప్‌తోపాటు జిల్లా కార్మి క ఉపాధికల్పన అధికారి కళ్యాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే విశ్లేషణాత్మక దృష్టితో మెలకువలు నేర్చుకునే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల నైపుణ్య ప్రదర్శనలు తిలకించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన



మట్టి నమూనాలను సేకరిస్తున్న విద్యార్థులు

నార్పల, జూలై 5: మండలంలోని బండ్లపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 50 మట్టి నమూనా శ్యాంపిళ్లను బండ్లపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలలో విద్యార్థుల ద్వారా సేకరించి అనంతపురంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. భూమిలోని పోషకాల విలువలను, ఎంత మోతాదులో ఎరువులను వాడాలి దాని మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఆత్మ అనంతపురం మద్దిలేటి, భూసారా పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రోజా పుష్పలత, భూసార పరీక్ష కేంద్రం అధికారి నాగేంద్ర, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, రైతు సేవా కేంద్రం అధికారులు శశిధర్, కుపేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రసన్నాయపల్లి సమీపంలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ

రాప్తాడు, జూన్ 5: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. మొక్కలు పెంచడం వలన భవిష్యత్ తరాల వారికి ఎంతో ఉపయోగమన్నారు. ఏపీఓ సావిత్రి, సర్పంచ్ శశికళ, టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఐడీఏఎస్ డైరెక్టర్

ఉరవకొండ, జూలై 5: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఐడీఏఎస్ డైరెక్టర్ అరుల్‌నందన్ శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆల య మర్యాదల ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట అర్చనలు, పూజలు చేశారు. ఆలయ చరిత్రను వివరించారు. తర్వాత శాలువా కప్పి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో విజయ్ కుమార్, డీడబ్ల్యూఎంఏ పీడీ వేణుగోపాల్, ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఓ విమల పాల్గొన్నారు.

దూరవిద్య వ్యవసాయ కోర్సులను వినియోగించుకోండి

కళ్యాణదుర్గం, జూలై 5: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సెప్టెంబరు నుంచి ఎనిమిది వారాలు వ్యవధిగల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కళ్యాణదుర్గం అధిపతి రాధాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తులు, పట్టు పురుగుల పెంపకం తదితర వాటిపై ఈ ఆన్‌లైన్ కోర్సులు ఉంటాయన్నారు.

అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ద్వారకనాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఈనెల 9వ తేదీ నుంచి శ్రీలంకలో నిర్వహించే అంతర్జాతీయ సబా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు భారత బాస్కెట్‌బాల్ జట్టు తరపున జిల్లాకు చెందిన ద్వారకనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. జిల్లా నుంచి భారత జట్టు ఎంపికై అంతర్జాతీయ పోటీలకు వెళ్లడం పట్ల ద్వారకనాథ్‌రెడ్డిని పలువురు అభినందించారు.

గంగవరం పాఠశాలను విలీనం నుంచి మినహాయించాలి

● ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కర్



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

అనంతపురం విద్య, జూలై 5: బెళుగుప్ప మండలం గంగవరం ప్రాథమిక పాఠశాలను విలీనం నుంచి శాశ్వతంగా మినహాయించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. విలీన సమస్యల నేపథ్యంలో ఆయన పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులు, విద్యార్థులను సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జీవో 117 వల్లే గతంలో గంగవరం ప్రైమరీ స్కూల్‌లోని 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో కలిపారని అన్నారు. అయితే పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి 50 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు తిరిగి ఉన్నత పాఠశాలకు పంపలేదన్నారు. ప్రైమరీ స్కూల్ నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో వంక, శ్మశానం ఉన్నా కూడా.... పలు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విలీనం నుంచి ఆ స్కూల్‌ను మినహాయించలేదన్నారు. ఇప్పుడు విద్యార్థులను హైస్కూల్‌కు పంపకపోవడం వల్ల ప్రైమరీలో అనధికారికంగా కొనసాగుతుండటంతో మధ్యాహ్నభోజనం, యూనిఫామ్స్, పుస్తకాలు, హాజరు అన్నీ స మస్యగా మారిందన్నారు. 2021లో 202 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లతో ఉన్న స్కూల్ విలీనం తర్వాత 18 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉండే పరిస్థితి కేవలం 117జీఓ వల్లే వచ్చిందన్నారు. అధికారులు ఇప్పటికైనా ఆ స్కూల్‌ను విలీనం నుంచి మినహాయించేలా చూడాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి



ఢిల్లీలో సీఎంను కలిసిన రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: ప్రమోషన్లలో తీవ్రంగా నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జనరల్ క్యాటగిరీలో పదోన్నతులు కల్పించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని ఆయన నివాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి రవిశంకర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు పదోన్నత్తుల్లో గ్రూప్ యూనిట్ కాకుండా క్యాడర్ యూనిట్‌గా లెక్కించాలని, ఐఏఎస్ ఆఫీసర్ల కమిటీని రద్దు చేయాలని కోరారు. పార్లమెంట్ 85వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 16(4) ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులతో పాటు తదనంతర సీనియార్టీ కొనసాగుతుందనే నిబంధనలను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. దీనికి తోడు కమిటీ వేసి బాధిత ఉద్యోగులను భయోందోళనకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

చరిత్రకు సజీవ సాక్ష్యాలు.. శిల్పాలు..

● ఎలక్షన్ అబ్జర్వర్ విలాస్ షిండే



మ్యూజియంను సందర్శిస్తున్న ఎలక్షన్ అబ్జర్వర్ విలాస్ షిండే

అనంతపురం కల్చరల్, జూలై 5: భారతదేశ చరిత్రకు సజీవ సాక్ష్యాలు శిల్పాలు అని జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్ విలాస్ షిండే అన్నారు. శుక్రవారం జిల్లా మ్యూజియంను ఆయన సందర్శించారు. పురావస్తు శాఖ ఏడీ రజిత ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మ్యూజియంలో ఏర్పాటు చేసిన నాటి మానవులు వినియోగించిన పనిముట్లు, కుండలు, టెర్రాకోట బొమ్మలు, సున్నపు బొమ్మలు, పురాతన ఇటుకలు, బ్రాంజెస్, పింగాణి పాత్రలు, శాసనాలు, పురాతన నాణేలు, ఆయుధాలను ఆయన ఎంతో ఆసక్తిగా తిలకించారు. వాటి చరిత్రను ఎలక్షన్ అబ్జర్వర్‌కు ఏడీ వివరించారు. విలాస్ షిండే మాట్లాడుతూ... మ్యూజియంను సందర్శించడం వల్ల జిల్లా చరిత్రను మరింత క్షుణ్ణంగా తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. అయితే మ్యూజియంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని లాన్ ఏరియాలో ఏర్పాటు చేసిన రాతి విగ్రహాలకు రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తే విగ్రహాలు వర్షానికి, ఎండకు దెబ్బతినకుండా ఉంటాయని, ఆమేరకు చొరవ చూపాలని సూచించారు. ప్రతి జిల్లాలోనూ ఇ లాంటి మ్యూజియంలు ఏర్పాటు చేయడం ద్వారా మన పూర్వీకుల చరిత్రను భావి తరం తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. జిల్లా మ్యూజియం నిర్వహణ బాధ్యతలకోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు తెప్పించేందుకు కంపెనీలతో మాట్లాడి ఆమేరకు తనవంతు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ శంకర్, మ్యూజియం సిబ్బంది పాల్గొన్నారు.

గుండె రక్తనాళాల పూడికలకు అత్యాధునిక చికిత్స

● సవేరా ఆస్పత్రి డాక్టర్ మూడే సందీప్ వెల్లడి

అనంతపురం టౌన్, జూలై 5: గుండె రక్తనాళాల పూడికలకు కిమ్స్ సవేరాలో అత్యాధునిక శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నట్లు కార్డియాలజిస్టు మూడే సందీప్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల మహిళ రాజేశ్వరి వారంక్రితం గుండెనొప్పితో ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆమెకు యాంజియోగ్రామ్ పరీక్షలు చేయగా గుండె రక్తనాళాల్లో పూడిక ఉన్నట్టు తేలిందన్నారు. ఆమెకు అత్యాధునిక టెక్నాలజీ అయినింట్రా వాస్క్యులర్ అల్ట్రాసౌండ్ సాయంతో ఆమెకు స్టంట్ అమర్చామన్నారు. ఈ విధానం ద్వారా రక్తనాళాల పరిస్థితి గుర్తించి వాటి మేరకు చికిత్స చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం రాజేశ్వరి ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

లబ్ధిదారులకు రేషన్ అందేనా..?

● రెండు నెలలుగా కార్డుదారుల ఎదురుచూపు

శింగనమల జూలై 5: రేషన్ బియ్యం ఈనెలైనా అందుతాయా అని మండల కేంద్రంలోని కార్డుదారులు ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలో ఐదు రేషన్‌షాపులో 1300 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ ద్వారా రేషన్ సరుకులు అందజేస్తున్నారు. జూన్ నెలకు సంబంధించి 1000 మంది రేషన్‌దారులకు బియ్యం అందజేసి 300 మందికి పంపిణీ చేయలేదు. ఎండీయూ ఆపరేటర్ మాత్రం రేషన్ డీలర్లు బియ్యం ఇస్తే వేస్తామని చేతులెత్తేశాడు. జూలైలో ఇప్పటి వరకు 800 మందికి మాత్రమే బియ్యం ఇవ్వగా, మిగిలిన 500 మందికి ఇవ్వలేదు. రేషన్ బియ్యం అందని వారు ఈనెలైనా ఇస్తారో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

మైనార్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



సర్పంచ్ తిరుపాలుకు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

రాప్తాడు, జూలై 5: పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. శుక్రవారం టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలుకు కాలనీ వాసులు వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ కాలనీలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ రేషన్‌షాపు, తాగునీటి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ కాలనీలో సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాలనీ వాసులు ప్రసాద్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

చెన్నేకొత్తపల్లి, జూలై 5: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో మహాశక్తి ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న హింస గురించి వివరించారు. బాల్యవివాహాలు, మహిళల గృహహింస తదితరవాటిపై సొసైటీ సిబ్బంది నాటికరూపంలో ప్రదర్శన ఇచ్చారు. సొసైటీ సీఈఓ శ్రీకవిత, అసోసియేట్ గౌరీ, పావని పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ఎమ్మెల్యేకి అందిస్తున్న కొత్తగాదికుంట పింఛన్‌దారులు

రామగిరి, జూలై 5: అమరావతి నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలని కొత్తగాదికుంట పింఛన్‌దారులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు శుక్రవారం విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్‌దారులు అమరావతి నిర్మాణానికి విరాళం అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. రూ.64వేలు విరాళాన్ని పింఛన్‌దారుల నుంచి సేకరించి అందించారు. భావితరాల కోసం రాజధాని ఉండాలన్న భావనతో విరాళం అందజేసినట్లు లబ్ధిదారులు తెలిపారు.

రైతు కుటుంబానికి పరామర్శ



రైతు భార్యను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీత

ధర్మవరం రూరల్ (కనగానపల్లి), జూలై 5: మండలంలోని సోమరవాండ్లపల్లిలో రైతు కూచేనరసింహులు రెండురోజుల క్రితం ఆ త్మహత్య చేసుకున్నా డు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాలసునీత శుక్రవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారించారు. కుటుంబసభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ సోమర చంద్రశేఖర్, శ్రీరాములు, చంద్ర, ఆది ఉన్నారు.

టీడీపీ కార్యకర్తకు...

అనంతపురం అర్బన్, జూలై 5: అనంతపురం రూరల్ మండలం తపోవనానికి చెందిన టీడీపీ కార్యకర్త రంగనాథ్‌ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న రంగనాథ్ కాలును ఇటీవల శస్త్రచికిత్స చేసి తొలగించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, నాయకులు జయప్రకాష్, బాలా, వెంకటరాముడు, ఆదినారాయణ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆస్పత్రిలో అన్నదానం

అనంతపురం టౌన్, జూలై 5: సాయిట్రస్ట్ నిత్య నారాయణ సేవ 16వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి వద్ద వెయ్యిమందికి అన్నదానం చేశారు. సాయి మాట్లాడుతూ ఆకలితో ఉంటున్న వారికి అన్నం పెట్టి కడుపు నింపాలనే ఆశయంతో 16 ఏళ్ల క్రితం నిత్యాన్నదానం మొదలు పెట్టానన్నారు. అప్పటినుంచి దాతల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగిస్తూ ఇప్పటి వరకు 80లక్షల మందికి అన్నదానం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ట్రస్ట్ సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, వీరేష్, పద్మలత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో అనంత గెలుపు



ఆల్‌రౌండ్‌షో పూజిత



అర్షియా నేహా



నిత్యారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీల్లో అనంతపురం, కృష్ణ, సెంట్రల్ జోన్ జట్లు గెలుపొందాయి. శుక్రవారం స్థానిక అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. రెస్టాఫ్ నార్త్ జోన్, అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీల్లో... నార్త్‌జోన్ 37.4 ఓవర్లలో 137పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలర్ నిత్యారెడ్డి 4 వికెట్లు తీసింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 39.5 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 138 పరుగులు సాధించింది. అర్షియానేహా 63పరుగులు సాధించడంతో అనంత జట్టు 7వికెట్ల తేడాతో గెలుపొందింది. సెంట్రల్‌జోన్, విశాఖపట్నం జట్లు తలపడగా...సెంట్రల్‌జోన్ 35.3 ఓవర్లలో 134పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన విశాఖపట్నం జట్టు 33.5 ఓవర్లలో 80పరుగులకే కుప్పకూలింది. సెంట్రల్‌జోన్ బౌలర్ 4 వికెట్లు తీసింది. మరోమ్యాచ్‌లో కృష్ణా, సౌత్‌జోన్ జట్లు తలపడగా... కృష్ణా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. ఇందులో గుణ చంద్రికారెడ్డి 61 పరుగులు, పూజిత 61 పరుగులు చేశారు. అనంతరం బరిలోకిదిగిన సౌత్‌జోన్ 41.1వర్లలో 126పరుగులకే కుప్పకూలింది. పూజితా 4వికెట్లు తీసి ఆల్‌రౌండ్‌షోతో కృష్ణా 114పరుగుల తేడాతో విజయం సాధించింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రభావం..

● నగరంలో శుభ్రమవుతున్న వంకలు



వంకలో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, జూలై 5: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాలతో అనంత నగరంలోని వంకలు శుభ్రమవుతున్నాయి. నగరంలోని నడిమి, మరువ వంకలతోపాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంపై ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి నగరపాలక సంస్థ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత నగర పాలక సంస్థ కార్యాలయంలో తొలిసారిగా సమావేశానికి హాజరై వంకల్లో పూడికతీత, డ్రైనేజీ వ్యవస్థలపై సంబంధిత అధికారులకు చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం నగరంలోని 28వ డివిజన్ అశోక్ నగర్ బ్రిడ్జి, 39వ డివిజన్ లక్ష్మీనగర్ పరిధిలోని వంకలో పూడికతీత పనులు చేపట్టారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోని వంకల్లో పూడికతీత పనులు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈవీఎంలు బద్దలు కొడితే తప్పుకాదా..?

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 5: ఈవీఎంలు బద్దలు కొడితే తప్పుకాదా అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జగన్‌రెడ్డిని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. జగన్ రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారని అన్నారు. మూడు, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిస్తే ఈవీఎంలు పగలగొట్టవచ్చా అని నిలదీశారు. ఈవీఎంలను పగలగొట్టడాన్ని సమర్థించిన జగన్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పల్నాడు ప్రాంతంలో నరమేధం చేసిన పిన్నెల్లిని మంచోడని జగన్ సర్టిఫికెట్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. దీన్ని బట్టే జగన్ నైజం ఏంటో అర్థమవుతోందన్నారు. ఒక రిమాండ్ ఖైదీ పిన్నెల్లిని అనేక కేసుల్లో చార్జ్‌షీట్లు ఎదుర్కొంటున్న మరో ముద్దాయి జగన్ నెల్లూరు జైల్లో ములాఖత్ అయ్యారని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో అనేక మంది దళితులు, బీసీలపై దాడులు, హత్యలు జరిగినా ఏ రోజూ స్పందించలేదని ధ్వజమెత్తారు. పైగా ఆయన చంద్రబాబును హెచ్చరిస్తున్నామని చెప్పడం చూస్తే ఆయన ఎలాంటి పనులకైనా తెగించేలా ఉన్నారని అర్థమవుతోందన్నారు.

సైకిల్ యాత్రికుడికి ఘన స్వాగతం



ప్రదీప్ పాటిల్‌ను అభినందిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

అనంతపురం కల్చరల్, జూలై 5: సైకిల్‌పై దేశయాత్ర చేపట్టిన యాత్రికుడికి అనంతవాసులు ఘన స్వాగతం పలికారు. బెంగళూరుకు చెందిన ప్రదీప్ పాటిల్ లడఖ్‌కు గురువారం ఉదయం బెంగళూరు నుంచి బయలుదేరి శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరానికి చేరాడు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం తదితరులు ప్రదీప్ పాటిల్‌కు స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందజేశారు. అనంతరం ప్రదీప్‌కు ఆలయ ఆవరణలో రాత్రి బస ఏర్పాటు చేశారు. సైకిల్‌పై లడఖ్ యాత్ర చేపట్టిన ప్రదీప్ తన లక్ష్యాన్ని చేరుకోవాలంటూ ఆకాంక్షించారు. శనివారం ఆయన తన యాత్రను కొనసాగిస్తాడు. కార్యక్రమంలో రూపనగుడి వెంకటేష్‌చోప్రా, హట్టి కేదార్నాథ్, బీఎస్ మురళి, సంకేపల్లి సత్యనారాయణ శర్మ, శ్రీనివాసశర్మ, చంద్రశేఖర్‌రావు, కేవీఎస్ చలపతిరెడ్డి పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రావూరి భరద్వాజ



రావూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, జూలై 5: తెలుగు నవలా రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర అన్నారు. రావూరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రావూరి తన జీవితకాలంలో 37 కథా సంకలనాలు, 17 నవలలు, బాలల నవలలు, 8 నాటకాలు రాసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారన్నారు. అనంత సాహితీ ప్రస్థానం ట్రస్టు వ్యవస్థాపకుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, పూజారి ఈరన్న, బండి వసంతకుమార్, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సీఎస్ శ్రీనివాసులు, సాయి పాల్గొన్నారు.

కందిపంటకు మద్దతు ధర పెంచాలి

అనంతపురం రూరల్, జూలై 5: కందిపంటకు మద్దతు ధర పెంచాలని చియ్యేడు గ్రామ రైతులు వ్యవసాయాధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని చియ్యేడు గ్రామంలో రైతు లింగమయ్య సాగు చేసిన కంది, వేరుశనగ పంటలను అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కువ శాతం కంది పంట సాగు చేసినట్లు రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. కందికి మద్దతు ధర పెంచాలన్నారు. రైతుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఏడీ తెలిపారు. ఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, మురళి, ఆర్‌బీకే అసిస్టెంట్ భువనేశ్వరి, రైతులు లక్ష్మీనారాయణ, లింగమయ్య ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం వద్దు

అనంతపురం విద్య, జూలై 5: జిల్లాలోని 11 ప్రాజక్టుల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం వద్దని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ప్రాజక్టు సీడీపీఓలకు సూచించారు. శుక్రవారం పీడీ ఆఫీస్‌లో సీడీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రాజక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టుల వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఉద్యోగోన్నతులకు అర్హులను గుర్తించాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డయేరియా నివారణపై అవగహన

శింగనమల, జూలై 5: డయేరియా నివారణపై ప్రతి ఒకరికి అవగహన కల్పిస్తున్నట్లు తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో విజృంభిస్తున్న డయేరియా అనే కథనం ప్రచురితం కావడంతో వైద్యాధికారి స్పందించారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాధికి నియంత్రణ చర్యల్లో భాగంగా నీటి ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు.

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, జూలై 5: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపా రు. మార్కెట్‌కు శుక్రవారం 90టన్నుల టమోటాలు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ..

తాడిపత్రి, జూలై 5: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో శుక్రవారం డబ్బుల విషయంలో సాయికృ ష్ణ, సునీల్‌కుమార్ వర్గాలకు చెందిన కొంతమంది ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీల్లో భాగంగా సాయికృష్ణ సునీల్‌కుమార్‌కు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బులు కావాలని సునీల్‌కుమార్ సాయికృష్ణను అడిగాడు. దీంతో మాటామాటా పెరిగి ఇరువర్గాల నడుమ ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో సాయికృష్ణ వర్గానికి చెందిన రవితేజ, మనోజ్‌కుమార్ తో పాటు కొంతమంది, సునీల్‌కుమార్ వర్గానికి చెందిన రవిశంకర్‌తో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని వారు చెప్పారు.

75 వీరాపురంలో పొలంబడి

గుమ్మఘట్ట, జూలై 5: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శుక్రవారం రాయదుర్గం వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, ఏఓ నిర్మల్‌కుమార్ రైతులకు పొలంబడి నిర్వహించారు. ఇందులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడానికి ఏయే పంటలు వేయాలి, సేంద్రియ ఎరువుల వాడకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. 14 వారాల పాటు పొలాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు పంటల దిగుబడులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట, జూలై 5: గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులు ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సురేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. భూమి పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో స్థానికంగా ఉన్న ఉపాధి సిబ్బందితో రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నియోజకవర్గ కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, జూలై5: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రసాదరావు నియమితులయ్యారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం అసోసియేషన్ జిల్లా కన్వీనర్ షఫీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అలాగే ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగరంగయ్య, కోశాధికారిగా సావిత్రమ్మ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రమేష్‌బాబు, సుజాత, అర్చన, గౌతమి, సహాయకార్యదర్శులుగా నూర్‌మహ్మద్, భవాని, చంద్రకళ, లలిత, వరలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంజులతో పాటు 10మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇసుక ట్రాకర్ల పట్టివేత

పామిడి, జూలై 5: పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జీ కొట్టాల గ్రామం వద్ద రెండు, పామిడిలో ఒక్క ట్రాక్టర్ అనుమతులు లేకుండా అధికలోడుతో వెళ్తుండడంతో పట్టుకుని పామిడి పోలీసు స్టేషన్ తరలించారన్నారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక పెన్నానది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. అనంతరం డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి వద్దనున్న పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం తహసీల్దార్ హరినా థరావుకు స్వాధీనం చేయగా, జరిమానా విధించారు.

అందుబాటులో రేబిస్ టీకాలు

బెళుగుప్ప, జూలై 5: మండలంలోని పశువైద్య కేంద్రాల్లో రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నట్లు పశు వైద్యాధికారి రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. బెళుగుప్ప, గంగవరం, వెంకటాద్రిపల్లి కేంద్రాల్లో అందుబాటులో ఈ టీకాలు ఉంచామని, కుక్కల పెంపకందారులు వాటిని కుక్కలకు వేయించాలని సూచించారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి, జూలై5: పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో శుక్రవారం 55మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ.400విలువగల సరుకులను అందజేశామన్నారు. ప్రతి ఏడాది క్లబ్ తరపున సరుకులను అందిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో తేలికపాటి వర్షం

యల్లనూరు, జూలై5: మండలంలో శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంతోపాటు వెన్నపూసపల్లి, పాతపల్లి, జంగంపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో పండ్లతోటలకు, ఖరీఫ్‌లో సాగుచేసిన సోయాబీన్, మొక్కజొన్న పంటలకు కొద్దిమేర ఉపశమనం కలిగింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, జూలై5: మండలంలోని బుగ్గ సమీపంలో శుక్రవారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.11040 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామని, పేకాటాడుతున్న రంగడుతోపాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

సమస్యల గుర్తింపునకు కాలనీల్లో పర్యటన

పామిడి, జూలై 5 : పట్టణంలోని ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో పాటు ఆయన తనయుడు ఈశ్వర్ శుభోదయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్థానిక టీడీపీ శ్రేణులు శుక్రవారం 18వ వార్డులో పర్యటించి పేరుకుపోయిన సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాలనీలలో ఏమేమి సమస్యలు ఉన్నాయో గుర్తించి, నివేదికలు తయారు చేసి అందజేశామని, త్వరలోనే వాటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

తాడిపత్రి/ పెద్దవడుగూరు, జూలై5: తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు తాడిపత్రి పెన్ననర్ల సంఘం వారు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. 511, 437, 425 మార్కులు సాధించిన అపర్ణ, గాయత్రి, తనూషకు వరుసగా రూ.5వేలు, 3వేలు, 2వేలు నగదు బహుమతులు అందించినట్లు సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. అలాగే యాడికిలోని ఆదర్శపాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు కులశేఖర్‌రెడ్డికి రూ.5500, పృథ్వీకి రూ.4500 నగదును దివంగత సర్పంచ్ బాలచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరి రామసుబ్బమ్మ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

తాడిపత్రి, జూలై5: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వాకర్స్‌పార్కులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

● మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ సూచన


తాడిపత్రిలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్


అమిద్యాలలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడిపత్రి, జూలై5: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ సూచించారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని నందలపాడులో డయేరియా, మలేరియా తదితర వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంద ని, వాటి బారిన పడకుండా దోమతెరలను ఉపయోగించుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు అతిసారా బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమం లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలోని అమిద్యాల గ్రామంలో వైద్యులు, వైద్య సిబ్బంది డయేరియాపై అవగాహ న ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు పావని మాట్లాడుతూ అతిసార నియంత్రణకు ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలని తెలిపారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని 11వ వార్డులో వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈఓ గౌస్.. పారిశుధ్యపనులను పర్యవేక్షించి డ్రైనేజీల్లో అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరంగయ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టెద్దుల అమావాస్య జాతర

డీ.హీరేహాళ్, జూలై 5: మండలంలోని పులకుర్తి గ్రామంలో శుక్రవారం మొట్టెద్దుల అమావాస్య జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మట్టెద్దుల అమావాస్య సందర్భంగా ఇక్కడ జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తెల్లవారుజామునే గ్రామస్థులు పెద్ద ఎత్తున గ్రామ సమీపంలో ఉన్న వాగుకు చేరుకున్నారు. అక్కడి నుంచి శివుని ఉత్సవ విగ్రహాన్ని గ్రామవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు. డప్పు వాయిద్యాలు మోగిస్తూ నందికోలు ఎగురవేశారు. పురుషులు గంగాజలంతో నిండిన కుంభాలతో, మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. తర్వాత స్థానిక ఆలయం వద్దకు అందరూ చేరుకున్నారు. అక్కడ శివుడికి గంగాజలంతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయం వద్ద తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి.. సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


శివుడి ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

అమావాస్య పూజలు

కణేకల్లు: అమావాస్యను పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వరాలయంలో విశేషపూజలను ఘనంగా జరిపారు. అర్చకులు ఉదయమే సుప్రభాత సేవ చేసి స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం విశేష పూజలు జరిపారు. వందలాగా భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం జరిగింది.


అలంకరణలో చిక్కణ్ణేశ్వరస్వామి

వారాహి అలంకరణలో దుర్గాభవాని

ఉరవకొండ: పట్టణంలో దుర్గాభవాని ఆలయంలో అమ్మవారు జేష్ఠ అమావాస్య సందర్భంగా వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకుని కుంకుమార్చనలు చేయించారు. ఆల య కమిటీ వారు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.


వారాహి అలంకరణలో అమ్మవారు

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మణ్ నాయక్

రాయదుర్గం రూరల్, జూలై 5: ఎరువులు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మణ్‌నాయక్ హెచ్చరించారు. పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్‌సీజన్ మొదలైన తరుణంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. వాటి ధరల పట్టికలను దుకాణాల వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు రశీదులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు, సలహాలు, సూచనల కొరకు 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఏఓ మహేంద్ర, మండలంలోని విత్తనాలు, ఎరువులు మరియు పురుగుల మందుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు, జూలై5: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం డిస్కం అదనపు కార్యదర్శి ఇబ్రహీం అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఇందులో శివయ్య మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలని, పోల్ టు పోల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కార్యనిర్వాహక కార్యదర్శి కల్యాణ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కుంగిపోయిన కల్వర్టు పరిశీలన

బొమ్మనహాళ్, జూలై 5: మండలంలోని కళ్లుదేవనహళ్లి వద్ద వేదావతిహగరిపై కుంగిపోయిన కల్వర్టును ఆర్‌అండ్‌బీ ఈఈ రాజగోపాల్, డీఈ రవిశంకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. రెండేళ్ల క్రితం వేదావతిహగరి వరద నీటి ఉధృతికి రోడ్డు కల్వర్టు దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో అప్పుడు రూ.1.20 కోట్లను అత్యవసర రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసింది. వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి పైపులు, రాళ్లు, మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. పనులు నాసిరకంగా చేయడంతో ఇటీవల కురిసిన వర్షానికి కల్వర్టు కుంగిపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు కల్వర్టును పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరమ్మతు పనులు చేయిస్తామని తెలిపారు. వీరి వెంట జేఈ సుజాత తదితరులు ఉన్నారు.

బహుమతుల ప్రదానం వాయిదా

గుంతకల్లు, జూలై5: పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయంపై సీబీఐ దాడి నేపథ్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో చేపట్టిన ఇంట్రా డివిజనల్ కల్చరల్ మీట్‌లో బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని వాయిదా వేశారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సంగీత, పాటల పోటీలు శుక్రవారం ముగిశాయి. సాయంత్రం డీఆర్‌ఎం ఆధ్వర్యంలో బహుమతులను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ డీఆర్‌ఎం కార్యాలయంపై సీబీఐ దాడుల కారణంగా ఆ కార్యక్రమాన్ని వాయిదావేశారు. త్వరలో తేదీని ఖరారుచేసి విజేతలకు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

డిప్యూటీ ఎంఈఓగా నాగరాజు బాధ్యతలు

గుత్తి,జూలై5: గుత్తి డిప్యూటీ ఎంఈఓగా నాగరాజు శుక్రవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, కోట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుభాన్ , ఉపాధ్యాయులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఐడీఏఎస్ డైరెక్టర్

ఉరవకొండ, జూలై5: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఐడీఏఎస్ డైరెక్టర్ అరుల్‌నందన్ శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట అర్చనలు, పూజలు చేశారు. ఆలయ చరిత్రను వివరించారు. తర్వాత శాలువా కప్పి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో విజయ్ కుమార్, డీడబ్ల్యూఎంఎ పీడీ వేణుగోపాల్, ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఓ విమల పాల్గొన్నారు.


ఆలయంలో ఐడీఏఎస్ డైరెక్టర్

బంగారు దుకాణాలపై అధికారుల దాడులు

● నాణ్యతను పరీక్షించే మిషన్లు సీజ్


సీజ్‌చేసిన మిషన్లను చూపుతున్న అధికారులు

తాడిపత్రి, జూలై5: పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న బంగారు దుకాణాలపై శుక్రవారం విజయవాడకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్‌సాగర్, డిప్యూటీ డైరెక్టర్ సాయికౌషిక్ రెండు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బంగారు నాణ్యతను పరీక్షించే మిషన్లను తనిఖీ చేశారు. సుదర్శన్ హాల్‌మార్కింగ్ జ్యువెల్లర్స్, శిరిపురి హాల్‌మార్కింగ్ జ్యువెల్లర్స్‌లో జరిగిన అవకతవకలను గుర్తించారు. 22క్యారెట్లు ఉన్న బంగారం ఈ షాపుల్లో 12 నుంచి 13క్యారెట్ల వరకు చూపింది. దీంతో మోసం జరిగినట్లు వారు గుర్తించి నాణ్యతను చూపించే మిషన్లను సీజ్ చేశారు. ఈ షాపుల్లో అవకతవక లు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని, అందువల్ల దాడులు నిర్వహించామని అధికారులు తెలిపారు. శనివారం కూడా దాడులు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాడుల్లో డిప్యూటీ డైరెక్టర్ అఖిల్‌స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వాహన రాకపోకలకు మార్గం సుగుమం

● రోడ్డుకు మరమ్మతులు చేయించిన టీడీపీ నాయకుడు


రోడ్డుకు మట్టి వేయిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూలై 5: మండల కేంద్రం నుండి మాల్యం మీదుగా ఉరవకొండకు వెళ్లె రోడ్డులో వాహనాల రాకపోకలకు టీడీపీ నాయకుడు మార్గం సుగమం చేశారు. ఇటీవల వచ్చిన వర్షాలకు స్థానిక వేదావతిహగరిలో ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. మాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఉప్పర ప్రభాకర్ శుక్రవారం సొంతనిధులతో హగరిలో రోడ్డుకు మట్టిని తోలించి మరమ్మతులు చేయించారు. దీంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అయింది. ఇందుకు వాహనదారులతో పాటు పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, కురుబ హరి, సూరి, జిలాన్, చంద్ర, బసవరాజు, గురుస్వామి, ఆదినారాయణ, మారెన్న, మాబు, జనసేన నాయకుడు పవన్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ..

తాడిపత్రి, జూలై5: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో శుక్రవారం డబ్బుల విషయంలో సాయికృ ష్ణ, సునీల్‌కుమార్ వర్గాలకు చెందిన కొంతమంది ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీల్లో భాగంగా సాయికృష్ణ సునీల్‌కుమార్‌కు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బులు కావాలని సునీల్ కుమార్ సాయికృష్ణను అడిగాడు. దీంతో మాటామాటా పెరిగి ఇరువర్గాల నడుమ ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో సాయికృష్ణ వర్గానికి చెందిన రవితేజ, మనోజ్‌కుమార్‌తో పాటు కొంతమంది, సునీల్‌కుమార్ వర్గానికి చెందిన రవిశంకర్‌తో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని వారు చెప్పారు.

ఆదుకోండి సారూ..

● ఎమ్మెల్యే కాలవకు బేడబుడగ జంగాల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న బుడగ జంగాల కులస్థులు

రాయదుర్గం రూరల్, జూలై 5: తాము పట్టణంలో దాదాపు 40 ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్నామని, అయినా ఇంతవరకు ఉండడానికి ఇళ్లు లేవని, ఇంకా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, ఆదుకోవాలని బేడబుడగ జంగాల ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కోరారు. వారు ఎమ్మెల్యేను పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తాము 40 ఏళ్ల నుంచి ఇక్కడే జీవనం సాగిస్తున్నామని, అయినా ఇప్పటికీ ఉండడానికి సొంత ఇళ్లు లేవని, బొంత డేరాల్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోయారు. విషపురుగులు, ఎలుకలు తరచూ ఇబ్బంది పెడుతున్నా అలానే జీవనం సాగిస్తున్నామని, వర్షం వస్తే పరిస్థితి దారుణంగా ఉంటోందని ఆవేదన చెందారు. తమకు ఇంటిస్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బేడబుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నాగయ్య, జమ్మన్నతో పాటు నరసింహులు, వన్నూరుస్వామి, ఆనంద్, మారేష్, శంకర్, శివయ్య, వెంకటేశు, సురేష్, రామాంజి, వెంకీ, శేఖర్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వీరశైవుల సన్మానం

కణేకల్లు: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వీరశైవుల సంఘం మండల నాయకులు సన్మానం చేశారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వేలూరు మరియప్ప ఆధ్వర్యంలో వీరశైవ లింగాయతులు ఎమ్మెల్యేను రాయదుర్గంలో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మృత్యుంజయ, శరభనగౌడ్, యువరాజ్‌గౌడ్, అశోక్, బసవరాజు, కృష్ణారెడ్డి, నాగరాజు, మంజునాథ, కుమారగౌడ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి


ప్రతాప్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

యాడికి, జూలై5: మండలంలోని లక్షుంపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి ప్రతాప్‌రెడ్డి (60) గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి వెంటనే గ్రామానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. లక్షుంపల్లి గ్రామ పంచాయతీలో గంగిరెడ్డి ప్రతాప్‌రెడ్డి టీడీపీ అభివృద్ధి కోసం ఎంతో కృషిచేశారని కొనియాడారు. తర్వాత మృతుడి భార్య, మాజీ సర్పంచు ప్రభావతమ్మను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్ తదితరులు ఉన్నారు.

గంగవరం స్కూల్‌ను విలీనం నుంచి మినహాయించాలి

అనంతపురం విద్య, జూలై 5: బెళుగుప్ప మండలం గంగవరం ప్రాథమిక పాఠశాలను విలీనం నుంచి శాశ్వతంగా మినహాయించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. విలీన సమస్యల నేపథ్యంలో ఆయన పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులు, విద్యార్థులను సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. జీవో 117 వల్లే గతంలో గంగవరం ప్రైమరీ స్కూల్‌లోని 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో కలిపారని అన్నారు. అయితే పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి 50 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు తిరిగి ఉన్నత పాఠశాలకు పంపలేదన్నారు. ప్రైమరీ స్కూల్ నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో వంక, శ్మశానం ఉన్నా కూడా.... పలు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విలీనం నుంచి ఆ స్కూల్‌ను మినహాయించలేదన్నారు. ఇప్పుడు విద్యార్థులను హైస్కూల్‌కు పంపకపోవడం వల్ల ప్రైమరీలో అనధికారికంగా కొనసాగుతుండటంతో... మధ్యాహ్నభోజనం, యూనిఫామ్స్, పుస్తకాలు, హాజరు అన్నీ సమస్యగా మారిందన్నారు. 2021లో 202 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లతో ఉన్న స్కూల్ విలీనం తర్వాత 18 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉండే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులు ఇప్పటికైనా ఆ స్కూల్‌ను విలీనం నుంచి మినహాయించేలా చూడాలని కోరారు.

దూరవిద్య వ్యవసాయ కోర్సులను వినియోగించుకోండి

కళ్యాణదుర్గం, జూలై 5 : ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సెప్టెంబరు నుంచి ఎనిమిది వారాలు వ్యవధిగల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కళ్యాణదుర్గం అధిపతి రాధాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తులు, పట్టు పురుగుల పెంపకం తదితర వాటిపై ఈ ఆన్‌లైన్ కోర్సులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలతో పేర్ల నమోదుకు వెబ్‌సైట్ https://angrau.ac.inను సంప్రదించాలన్నారు. లేదా 8008788776ను సంప్రదించాలన్నారు. ఆసక్తిగలవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

యాడికి: మండలకేంద్రంలో అధికారులు, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వైద్యులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్ మాట్లాడుతూ.. దోమల నుంచి డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ దోమలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధిచెందకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ర్యాలీలో ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ కాశప్ప, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ధర్మతేజ

కళ్యాణదుర్గం, జూలై 5 : మున్సిపాలిటీలోని మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎస్సీ కోచింగ్ ఉచిత శిక్షణకు హాజరైన అభ్యర్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మేనల్లుడు దేవినేని ధర్మతేజ సుమారు 700 మంది అభ్యర్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల నుంచి అభ్యర్థులు వస్తున్నారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భోజన వసతి కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్, జూలై 5: మండలంలోని పింజరి కొట్టాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ విజయకుమారి శుక్రవారం పునఃప్రారంభించారు. 2019వ సంవత్సరంలో విద్యార్థులు లేని కారణంగా ఆ పాఠశాలను మూసివేశారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 12 మంది ఉన్నారు. దీంతో డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాలను మళ్లీ ప్రారంభించామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో కడదరకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హుస్సేన్ బాషా, సీఆర్‌ఎంటీ తిమ్మరాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల పునఃప్రారంభంలో ఎంఈఓ, గ్రామస్థులు